# జాన్సన్ నాయక్‌ను గెలిపించుకుందాం

■ బీఆర్ఎస్ నాయకులు



ఖానాపూర్‌టౌన్ : మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 29 : నాయకులు, కార్యకర్తలు అందరం కలిసి బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి లక్ష్మణ్ రావు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్తపల్లి సురేశ్ పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర నాయకులు పైడిపెల్లి రవీందర్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో అభ్యర్థులను గెలిపించుకుంటే వారు తమను అభివృద్ధిలో భాగస్వామ్యం చేయకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. ఊట్నూర్‌కు వచ్చిన మంత్రి హరీశ్‌రావు రాబోయే రోజుల్లో పైడిపెల్లి రవీందర్‌రావుకు సీఎం కేసీఆర్ సముచిత స్థానం కల్పిస్తారని చెప్పారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్, రవీందర్ రావు ఆధ్వర్యంలో అందరం కలిసి జాన్సన్ నాయక్‌ను సైనికుల్లా పని చేసి గెలిపించుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొండాడి శ్రీనివాస్‌రావు, బీసీ రాజన్న, ఎల్లాపి సంఘం జిల్లా అధ్యక్షుడు పుప్పాల మురళి, కారింగుల రాములు, కిషన్, గణపతిరావు, సింగాపూర్ రాజన్న బీసీ రమేశ్, కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.



పెంబి : వేణుగర్ గ్రామంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**వేణునగర్‌లో..**

పెంబి, అక్టోబర్ 29 : మండలంలోని వేణునగర్ గ్రామంలో గడప గడపకు బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర పార్టీల మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ గంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కున్సోత్ విలాస్, గాండ్ల శంకర్, రమేశ్, ఇస్మాయిల్, రాజేందర్ పాల్గొన్నారు.



జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ఆదివాసీ నాయకులు

## ఆదివాసీ యోధుడు కుమ్రం భీం

దస్తురాబాద్, అక్టోబర్ 29 : ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన ఆదివాసీ యోధుడు కుమ్రం భీం అని రేవోజిపేట ఎంపీటీసీ వెడ్మా మాన్కు, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు మెస్రం సురేందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) మండల కమిటీ ఆధ్వర్యంలో 83 వర్ధంతిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి, కుమ్రంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీ మహిళలు, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. నాగు స్వామి, గ్రామ పటేళ్లను సన్మానించారు. ఉప సర్పంచ్ సిడాం రాజు, మండల ప్రధాన కార్యదర్శి తొడసం కిరణ్ పాల్గొన్నారు.

## యువతకు సన్మానం

కడెం, అక్టోబర్ 29 : ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతను ఆదివారం లింగాపూర్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మిడి మహేశ్వర్, గౌరవ అధ్యక్షుడు దానవేణి మల్లేశ్, సభ్యులు తుమ్మ నరేశ్, కుర్ర శేఖర్, బొమ్మిడి రాజేందర్, కుర్ర గంగాధర్, కిశోర్, దీపక్, గంగారాం, ఉపసర్పంచ్ కుమ్మరి రంజిత్ పాల్గొన్నారు.



ఉద్యోగులను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

## నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మహిళా, ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యురాళ్లు , నాయకులు

ఇంద్రవెల్లి, అక్టోబర్ 29 : ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా దేవతను ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాబాయి, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సర్పే సోంబాయి, ఇచ్చోడ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కూడిమెత జంపగ, బీఆర్ఎస్ నాయకులు సోయం సతీశ్, పెందూర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

**తెరుచుకున్న ఆలయాలు..**

## ప్రత్యేక పూజలు

దస్తురాబాద్, అక్టోబర్ 29 : చంద్రగ్రహణం సందర్భంగా మండల కేంద్రంతోపాటు, మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాలను అర్చకులు మూసివేశారు. చంద్రగ్రహణం ముగిసిన తర్వాత ఆదివారం ఆలయాలను అర్చకులు తెరిచారు. ఆలయాలను శుభ్రంగా శుద్ధి చేశారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ప్రగతి పథంలో దిల్దార్‌నగర్

- రూపురేఖలు మార్చిన పల్లె ప్రగతి
- మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట
- వేగంగా అభివృద్ధి పనులు
- బీఆర్ఎస్ సర్కారు ప్రత్యేక దృష్టి

కడెం, అక్టోబర్ 29 : పల్లె ప్రగతితో గ్రామాల అభివృద్ధి వేగంగా సాగింది. రాష్ట్ర ప్రభుత్వం నూతన పంచాయతీలను ఏర్పాటు చేసింది. అభివృద్ధే లక్ష్యంగా పనులు చేపట్టి, గ్రామాల రూపురేఖలను మార్చివేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి ఎలగడప పంచాయతీ నుంచి నూతన పంచాయతీగా ఏర్పాటైన దిల్దార్‌నగర్ అభివృద్ధిలో ఇతర పంచాయతీలకు ఆదర్శంగా నిలుస్తున్నది. అయితే దిల్దార్‌నగర్ పంచాయతీ 430 మంది ఓటర్లతో 650 మంది జనాభాతో నూతనంగా ఏర్పాటైంది. ఈ పంచాయతీలో మూడు విడుతల్లో భాగంగా పల్లె ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న మురుగు కాలువల నిర్మాణం పూర్తి చేశారు. అసంపూర్తిగా, నిరుపయోగంగా ఉన్న భవనాలను తొలగించారు. హరితహారంలో భాగంగా భారీగా మొక్కలు నాటారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపర్చారు.



గ్రామంలో ఇటీవల నిర్మించిన డ్రైనేజీ నిర్మాణ పనులు

**గ్రామంలో అభివృద్ధి పనులివి..**

సర్పంచ్ బద్దెనపల్లి విజయస్టీఫెన్ ఆధ్వర్యంలో దిల్దార్‌నగర్ పంచాయతీ దినదిన అభివృద్ధి చెందింది. రూ. 5 లక్షలతో హైమాస్ట్ లైటింగ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, రూ. 35 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. పంచాయతీకి నూతన ట్రాక్టర్ కొనుగోలుతో పాటు, ట్యాంకర్, ఇద్దరు మల్టీపర్పస్ వర్కర్లతో ప్రతి రోజూ చెత్త సేకరణ చేపడుతున్నారు. అలాగే బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా తీర్చి దిద్దడం, ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి, ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. పంచాయతీలో వందకు పైగా పెన్షన్లను మంజూరు చేశారు. శ్మశాన వాటిక, సెగ్రిగేషన్ షెడ్డు నిర్మాణంతోపాటు క్రీడా ప్రాంగణం, సామూహిక ఇంకుడు గుంతలు, పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.



హరితహారంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు



పల్లె ప్రకృతి వనం

**ప్రగతిలో జీపీని ముందుకు తీసుకెళ్తున్నాం..**



ప్రజలు, పాలకవర్గ సభ్యుల సహకారంతో పంచాయతీలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేశాం. ఇటీవలే గ్రామంలో ఐదు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేశాం. సర్పంచ్ విజయ స్టీఫెన్ ఆధ్వర్యంలో పంచాయతీని అభివృద్ధిలో ముందుంచాం.

**- ముత్యంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, దిల్దార్‌నగర్, కడెం.**

**ప్రభుత్వ సహకారంతోనే అభివృద్ధి..**



రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గ్రామంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టాం.. ప్రతి వార్డుకు సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టాం. పల్లె ప్రకృతి వనం, ట్రాక్టర్, ట్యాంకర్ కొనుగోలు, హరితహారంలో భాగంగా మొక్కలు నాటాం. చిన్న పంచాయతీని అభివృద్ధిలో ముందుంచాం. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మరింత ముందుకెళ్తాం.

**- బద్దెనపల్లి విజయ, సర్పంచ్, దిల్దార్‌నగర్**